

# పావలా వడ్డీ

తూరుపు ఆకాశం సన్నవి వెలుగురేఖల నలంకరించుకుంటోంది. ఇంటిముందున్న వేపచెట్టుమీద రాత్రంతా విశ్రాంతి తీసుకున్న పక్షులు వరుసలు కట్టి మేతకు బయలుదేరాయప్పుడే. అరుగుమీదున్న గంగమ్మ ఆకుకూర కట్టల్ని గంపలో సర్దుకుంటూ, వాటిని ఏయే కాలనీల్లో అమ్మాలనే ప్రణాళిక సిద్ధం చేసుకుంటోంది. "గంగక్కా! ఇయ్యాల్ల మున్సిపాల్టి ఆఫీసుకు వోదామా!" ఇంటిముందున్న సరళ వచ్చి అడిగింది. ఏం జవాబివ్వాలో తోచక ఆమె మనసు కుడితిలో పడ్డ ఎలుకలాగైంది. ఎలక్ట్రానిక్ వోటింగ్ మిషన్ను మొదటి సారి చూస్తున్న వోటర్లాగైపోయింది సరళ. గంగమ్మ వాలకం అర్థంకాలేదు. "గట్ల చూస్తున్నవేందక్కా?" ఆశ్చర్యపడింది. వాళ్లిద్దరు ఎదురెదురింటివారు. కలివిడిగా ఉంటారు. సంజీవ పర్వతాన్ని సకాలంలో అందించాలనుకున్న వీరాంజనేయుడిలా కూరగంపను నెత్తిమీదుంచి బయలుదేరుతుంది గంగమ్మ. కాలినడకల కాలనీల్లో కూరకట్టలమ్ముతూ ఆమె రాత్రింబవళ్లు బట్టలు కుడుతూ సరళ గుట్టుగా పొట్టబోసుకుంటున్నారు.

"రెక్కాడితే దొక్కాడని మనము గా స్కీము ఎంబడి వడ్తిమి. రెండునెలల నుండి కాలుకు బలపం కట్టుకుని తిరుగుతున్నం. ఆఖరికేమైతదో ఏమో?" నడివయసు గంగమ్మ నుదుటిమీద అనుభవరేఖలు వంకర్లు తిరిగాయి. రేఖల మధ్య ఎర్ర కుంకుమబొట్టు సూర్యునిలా మెరుస్తోంది. "గట్లంటే ఎట్లక్కా? డ్వాక్రా గ్రూపుల చేరి మనలాంటి ఆడవాళ్లు గవర్నమెంటు లోన్లు దీసుకుని బాగుపడ్తున్నరు". "నిజమే కానీ... తిరిగి తిరిగి దీవానా ఐపోతున్నం గదా!" కట్టలు సర్దడం పూర్తిచేసి నుంచుండి ఒళ్లు విరుచుకుంది గంగమ్మ. "అడగందే అమ్మగూడా అన్నం బెట్టదు గదా!" కళ్లమీదికొచ్చిన వెంట్రుకలను సవరించుకుంది సరళ. "సాధించాలంటే కష్టపడాలె గదక్కా! మనిద్దరం మనపని వదలిపెట్టి ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నం. మన గ్రూపు

రిజిష్టరైపోతే బాంకువాళ్లు అప్పులిస్తరు. అప్పుడు మన గ్రూపులోల్లందరికీ లాభమేగదా!" కళ్లల్లో పట్టుదల కదిలింది. 'నిజమే! నాది సంతకానికి సరిపోయే చదువేనాయె. సరళ పదోతరగతి పాసైంది.

మొగుడు తాగి తాగి చచ్చిపోయుండు. పిల్లలిద్దరు చదువుకుంటున్నరాయె. రాతపూతలన్నీ చూస్తదనే గ్రూపు సెక్రటరీగా ఎన్నుకుంటిమి., నేను మొదటి లీడర్నైతి' అనుకున్న గంగమ్మ కళ్లల్లో ఆశారేఖ తళుక్కుమంది. "గీ కూరలమ్మి వస్త. రాంగనే పోదాము" అంది. "గట్లన్నవ్... బాగున్నది. తొమ్మిది వరకు రావాలె మరి. నేను పిల్లన్నీ బడికి తోలిచ్చి తయారుగుంటా. గా గంగెద్దుల బాలయ్య బిడ్డ పెండ్లి... ఆ పెండ్లి బట్టలు కుట్టాలె. పాపం! ఇప్పుడు గంగెద్దు ఆటల్లేవు గాని ఇంటిపేరు అదే పడిపోయింది. ముందు గంగెద్దులాడించి బతికేవాళ్లటా..." అంటూ సరళ వెనుదిరిగింది. గంప నెత్తిమీదకెత్తుకుని బయలుదేరింది గంగమ్మ. గంగెద్దు గుర్తుకు రాగానే ఆమె మెదడు పొరల్లో గతం గంతులేస్తోంది. గంగెద్దు కనబడితే జనాలు దండాలు పెట్టేవారు. పిల్లలు కేరింతలుకొట్టేవారు. ప్రతి ఇంట్లో గంగెద్దును 'బసవన్న' అంటూ ధాన్యం, బట్టలు సమర్పించుకునేవారు. బసవన్నను అలంకరిస్తూ గంగమ్మా పులకించిపోయేది. గంగెద్దు వీపుమీద రంగురంగుల గుడ్డలువేసి, నుదుటిమీద పసుపురేఖలు గీసేది. రేఖల మధ్య గంధంబొట్టు, బొట్టు మధ్యన ఎర్రని కుంకుమబొట్టు పెట్టేది. అర్ధచంద్రాకారంలో కొమ్ములు, మెడలో గంటతో శివుని వాహనం నందీశ్వరునిలా కనబడేదది. గంగమ్మ భర్త పేరే గంగెద్దుల గంగరాజమయె. అతడు తూరుపు ఆకాశం సిందూరవర్ణం సంతరించుకోకముందే స్నానాదులు ముగించుకునేవాడు. నుదుటి విభూతిరేఖల మధ్య చందనం బొట్టు, పాల నురగలాంటి తెల్లని ధోవతి, పొడగాటి అంగరఖా పలురంగుల్లో ఉండేది. నెత్తికి రుమాలుతో జంగం దేవరలా తయారయ్యేవాడు. అంతకుముందే సన్నాయి వాయిద్యాలు సరిచూసుకునేవాడు. సన్నాయి వాయిస్తూ గంగరాజము నడుస్తూంటే వెనక గంట గణగణల్తో గంగెద్దు అడుగులు తాళం వేస్తుండేవి. ఆ దృశ్యం చూడముచ్చటగా ఉండేది. సంక్రాంతి సీజన్లో ఇంట్లో ధాన్యలక్ష్మి తాండవ మాడేది. నిత్య కల్యాణం పచ్చతోరణంలాగుండేది.

గంగెద్దు ముందు గంగరాజము గంతులేస్తూ "అమ్మగారికి దండంబెట్టు, అయ్యగారికి దండంబెట్టు..." పాట పాడుతుంటే, గంగెద్దు ముందటి కాళ్లు వంచి ఇంటి యజమానికి నమస్కరించేది. తలాడిస్తూ పిల్లల్ని రంజింపజేసేది. ఆబాలగోపాలం ఆ విన్యాసాలను ఆసక్తిగా చూసేవారు. సన్నాయిరాగాల కనుగుణంగా గంగెద్దు నాట్యమాడుతుంటే, చూస్తున్నవాళ్లంతా ఊగిపోయేవారు. కూడు, గుడ్డకు కొదవుండేది కాదు. గంగెద్దు ఆటల్ని

శివలీలలుగా భావించి ఇంటికి చాటెడు ధాన్యం దానంచేసేవారు. ఊరంతా తిరిగేసరికి నెల రోజులకు సరిపోయే తిండిగింజలు ఒక్క రోజులోనే దొరికేవి. ధాన్యం మూటల్ని గంగెద్దుమీంచి దింపి ఇంట్లో వేస్తుంటే తృప్తిగా ఉండేది. మాయదారి పట్నంఫ్యాషన్లు పల్లె సంస్కృతిని మింగేస్తుంటే, పట్నం నాగరికత పల్లెటూళ్ళను చుట్టేసి విషమయం చేసింది. మోటబావులు మాయమై కరెంటు మోటార్లతో బోరుబావులొచ్చినై. వరి కలుపుకి, పంట కోతగ్గూడా మిషన్లొచ్చినై. గంగెద్దు ఆటాపాటా... సినిమా, టీవీ సీరియళ్ల ముందు నిలువలేకపోయింది.

ఆదరణ లేక గంగరాజము మనస్తాపంతో మంచంపట్టాడు. పక్షవాతంతో కుడికాలు, చెయ్యి పడిపోయినై. ఆయుర్వేద వైద్యం పుణ్యమాని తగ్గుముఖం పట్టిన రోగం....ఇంట్లో తిరగనిస్తోంది. తన పనులు తను చేసుకుంటున్నాడతను. అప్పట్నుంచే గంగమ్మ నెత్తిమీదికి కూరగంప వచ్చింది. ఒక్కగానొక్క కూతురు పెళ్లవగానే అత్తారింటి కెళ్లిపోయింది. ఆకుకూరలమ్ముతూ, భర్తకు సేవలందించడమే గంగమ్మ దినచర్య ఐపోయింది. వైద్యం కోసం గంగెద్దు నమ్మిన సంగతి గుర్తుకొస్తే, కడుపుల కవ్వంబెట్టి చల్లజేసినట్టవుతుంది ఆమెకి. మహిళలు డ్వాక్రా గ్రూపుగా ఏర్పడి పొదుపు సంఘాన్ని నడిపిస్తుంటే, ప్రభుత్వం పావలా వడ్డీకే అప్పులిస్తుందని తెలిసింది. 'అప్పు దొరికితే ఆకుకూరలతో పాటు కాయగూరలు, మిరపకాయలు గూడా అమ్మవచ్చు. బయట తిరగాల్సిన అవసరం లేదు. ఇంటి అరుగులమీదుంచి అమ్ముకోవచ్చు. గంగరాజము గూడా సాయపడ్తాడు. మంచి లాభాలొస్తాయి...' అని బాగా ఆలోచించే గంగమ్మ రంగంలోకి దిగడమైంది. కొత్తగా డ్వాక్రా మహిళాగ్రూపు లేర్పడుతుంటే "నేను గూడా మీ గ్రూపులో సభ్యురాలునవుతా" అని అడిగిందో గ్రూపు లీడర్ను. "మా గ్రూపులల్ల అవకాశం లేదు. నువ్వే ఓ గ్రూపు తయారుచేసి లీడర్‌గా ఉండు. కావాలంటే కొంతమంది సభ్యురాళ్లనిస్తాం"... ఏ గ్రూపు లీడర్‌నడిగినా అదే సమాధానం. పద్ధతులు నాకు తెల్వవాయె. వానా కాలం చదువు సంతకం మాత్రమే నేర్పింది" నిరాశగా పెదాలు చప్పరించింది గంగమ్మ ఓ గ్రూప్‌లీడర్ ముందు. "అయినా సరే! పద్ధతులు తెలుసుకో. చదువుకున్న ఒకామెను సెక్రటరీగా చేసుకో. రాతపూతలన్నీ ఆమెనే చూస్తది. ఈ రోజుల్లో గ్రూపులకు సభ్యురాళ్లు బోలెడు దొరుకుతున్నరు గాని, లీడర్లు దొరుకుతలేరు" అందావిడ. ఇంటిముందున్న సరళ... గంగమ్మ మనసులో మెదిలింది. విషయమంతా చెప్పగానే సరళా ఒప్పుకుంది. ఇద్దరూ కలసివెళ్ళి ఇంకో లీడర్నడిగారు "కొత్త గ్రూపునెట్లా షురూజెయ్యాలె? ఏ ఆఫీసుల అడగాలె?" జవాబుకోసం చెవులు చేటలైపోయినై. ఆ లీడర్ జవాబిచ్చింది "మున్సిపాల్టి ఆఫీసుల

ఆఫీసర్లుంటరు. అంతా వాళ్లే చెప్తరు. వాళ్లు చెప్పిందంతా వింటూ గంగెద్దోలె తలూపాలె. ఏ పద్ధతిల పొమ్మంటే అదే పద్ధతిల నడవాలె. బస్...!" దాంతో, వీరి పట్టుదల బిగుసుకుంది.

+

మర్నాడు గంగమ్మ కాళ్లరిగేలా కాలనీలు తిరిగి, ఆకుకూరలమ్మి వచ్చింది. ఇద్దరు పిల్లల్నీ బడికి పంపించింతర్వాత, తయారైంది సరళ. ఇద్దరూ కలిసి మున్సిపల్ ఆఫీసుకెళ్లారు. టైం పదకొండు దాటింది. ఎవరినేమడగాలో తెలీదు. ఎరగని ఊళ్లో మొరగని కుక్కల్లా ఆఫీసులో అటూ ఇటూ తిరుగుతూంటే అటెండర్ శాంతమ్మ ఆపేసింది. "మీకేం గావాలి?" చురచుర చూస్తూ అడిగింది. సరళ చేతులు పిసుక్కుంది. ఎదలోతుల్లో ఏదో భయం. గ్రూపుల ఆఫీసర్లు ఎక్కడుంటరు?" గంగమ్మనే అడిగింది. అటెండర్ మొహంలో ఆరు రంగులు మారినై "ఏ గ్రూపులట్లా?" "గదేనమ్మా, ఆడోళ్ల గ్రూపులు. వాళ్లకు అప్పులిప్పించేటోళ్లు" "గా ఎదురుంగ రూములుంటరు" శాంతమ్మ స్వాతిశయం. మొహాలు చూసుకొని ఆ రూముకెళ్లారు. ఖాళీ కుర్చీలు వెక్కిరించినవై. మళ్ళీ శాంతమ్మ నాశ్రయించారు. "ఆ రూముల ఎవ్వరూ లేరక్కా!" అంది గంగమ్మ.

"అవును గదా" వాళ్ళిప్పుడు గ్రూపుల పని మీద గల్లీలల్ల తిరుగుతుతున్నరు. రేపు పదింటికి రాండ్రి" చెప్పేసి ఎవరో పిలుస్తున్నట్టు వెళ్లిపోయింది శాంతమ్మ. ఇంకో అటెండరునడిగి, శాంతమ్మ ఇంటి అడ్రసు కనుక్కున్నారు. మర్నాడుదయం ఆ ఇంటికెళ్లారు ఇద్దరూ. నాల్గు కూరకట్టలు చేతికిచ్చి "గా గ్రూపులెట్లా షురూ జెయ్యాలక్కా?" దీనంగా అడిగింది గంగమ్మ. శాంతమ్మ శాంతమూర్తిగా మారింది. ఇద్దర్నీ కూచోబెట్టింది. "వాటిని మహిళా డ్వాక్రా గ్రూపులంటారు..." తో ప్రారంభించి, దానికి సంబంధించిన ప్రాజెక్టు ఆఫీసరు, మిగతా సిబ్బంది గురించి చాలా చెప్పింది. రెండు బుర్రలకూ అర్థమైంది కొంచెమే అయినా, దారి దొరికింది. రెండోరోజు దూరంగా ఉన్న కాలనీలు తిరక్కుండానే ఇంటికొచ్చింది గంగమ్మ. బట్టలు కుదుతున్న సరళను మందలించి మున్సిపల్ ఆఫీసుకు తీసుకెళ్లింది. టైం పదైపోయింది. ఆఫీసులో ఎవరూలేరు. శాంతమ్మ గూడా లేదు. కుర్చీలు తుడుస్తున్న మహిళ నడిగారు ఇద్దరూ. ఆవిడ దవడ కిందున్న కిళ్లీని కసిగా కొరికి "శాంతక్కది నాకంటె పెద్ద నౌకరీ. నేను స్వీపర్ను" అంటూ నేలమీదున్న చీపురు పైకిలేపి గోడ గడియారం చూపించింది.

పదిన్నర తర్వాత వచ్చింది శాంతమ్మ. విసుగునంతా లోపలే అదిమిపెట్టి "ఇయ్యాల్ల పదింటికే వచ్చినం. ఆఫీసర్లెవ్వరూ రాలేదు" అంది సరళ. శాంతమ్మ ఎగాదిగా చూసింది. "వచ్చేటైమైంది. గా బెంచీమీద కూచోండ్రి" అంటూ లోపలికెళ్లింది. ప్రభుత్వ పథకాలు

పోస్టర్లై గోడలకు వేళ్లాడుతున్నాయి. వాటినే చూస్తూ బెంచీమీద కూచున్నారు గంగమ్మ, సరళ. ఎత్తుమడమల చెప్పుల్తో నడిచొచ్చి, ఇద్దరు మేడమ్స్ కుర్చీల నాక్రమించారు. లేచివెళ్లి సవినయంగా నమస్కరించి, వచ్చిన పని గురించి చెప్పారిద్దరూ. "ఇవ్వాళ్ల ప్రాజెక్టు ఆఫీసరు టూరుకెళ్లిండు. రేపు రాండ్రి" ఏదో దినపత్రిక చూస్తూ కుర్చీకొరిగింది ఒకావిడ. "ఆఫీసుకొచ్చినమో లేదో, బెల్లమ్మీది ఈగలోలె మూగిండ్రు" మరో మేడమ్ కొంగు సవరించుకుంటూ జేరగిలబడింది. ఇద్దరిలో రోషం పొంగింది. మొహాలు చూసుకుని శాంతించారు. సరళ ముందుకొచ్చి "ప్లీజ్ మేడమ్! గా గ్రూపు గురించి వచ్చినం. కొత్త గ్రూపు తయారుచేస్తున్నం" చేతులు జోడించింది. "మీది ఏ ఏరియా?" దినపత్రిక మేడం అడిగింది. చెప్పేశారు. "అయితే అగో! ఆ విమల మేడమ్ నడుగుండ్రి" అప్పుడే వచ్చికూచున్న మేడంను చూపించింది. ఇద్దరూ నమస్కారం పెట్టి అడిగారు. ఆఫీసు భారాన్నంతా తానొక్కతే మోస్తున్నట్లు "ఇప్పుడు చాలా పనుంది. రేపు మా ఇంటికి రాండ్రి" అని విమల మేడం ఊపిరి పీల్చుకుంది. ఫ్యాన్‌వెయ్యమని శాంతమ్మనాదేశించి, కుర్చీవెనక్కి వాలింది.

మర్నాడుదయం... ఉట్టిచేతుల్తో వెళ్తే బాగుండదని, విమల ఇంటికి అరడజను అరటిపళ్లతో వెళ్లారు. చిరునవ్వుతో స్వాగతించి కూచోబెట్టుకుంది. "మీ గ్రూపుల లీడర్లెవరు? సభ్యులెవరు?" అడుగుతూ పళ్ళు అందుకుంది. "గ్రూపునెట్లా తయారుచెయ్యాల్నో పూర్తిగా తెల్వలేదు మేడం!" అసలు విషయం కక్కేసింది గంగమ్మ. వాళ్లిద్దర్నీ జూలో జంతువుల్లా చూస్తూ, కిందినుంచి మీద్దాకా పరిశీలించి ముసిముసిగా నవ్వింది విమల. ఆ చిరునవ్వును చిరుకానుకగా భావించి శ్రద్ధగా వింటున్నారు వాళ్లు. "ముందుగా పదిమంది ఆడవాళ్లను సభ్యులుగా చేర్చుకోవాలె. వాళ్లంతా చిన్న చిన్న చేతిపనులు చేస్తూ బతికే వాళ్లు. అందరికీ గుర్తింపు కార్డులుండాలె. పదిమంది మీటింగువెట్టుకొని అందులోంచి ఒకర్ని అధ్యక్షురాలుగా అనగా... ఫస్ట్ లీడర్ను, మరొకామెను కార్యదర్శిగా అనగా సెకండ్ లీడర్‌గా ఎన్నిక చేసుకోవాలె. లీడర్లు ఆ లిస్టుతోని మా ఆఫీసుకు రావాలె..." అని గ్రూపు ఏర్పాటులోని గమత్తులన్నీ చెప్పేసింది.

సరళ, గంగమ్మల కళ్లల్లో వెలుగులు పొడచూపినై. పదిరోజులు వాళ్ల వార్డులో తిరిగి, ఇంకో ఎనమండుగురు సభ్యుల్ని చేర్చుకున్నారు. అంతా కలసి కూచుని గంగమ్మను అధ్యక్షురాలిగా, సరళను కార్యదర్శిగా ఎన్నుకున్నారు. కాయితాలమీద రాసుకుని సంతకాలు చేశారు. వాటిని తీసుకెళ్లి ఇద్దరు లీడర్లూ మున్సిపల్ ఆఫీసులో విమలకు చూపించారు. ఆవిడ ప్రాజెక్టాఫీసర్ వద్దకు తీసుకెళ్లి చూపించింది. ప్రాజెక్టాఫీసర్ రింగ్‌ఛైర్లో

కూచుని విలాసంగా కాళ్లూపుతున్నాడు. లిస్టును రెండు సార్లు చదివి దమ్ముదీశాడు. "అప్లికేషన్ ఫారం జిరాక్సు సెంటర్లో దొరుకుద్ది. దాన్ని నీట్‌గా, తప్పులు లేకుండా నింపి..." ఇంకేదేదో చెప్పాడు. చివరికి "మీకేమి డౌటున్నా విమలమేడం నడగండి" సలహాయిచ్చాడు. ఇంటికెళ్తూ ఇద్దరూ జిరాక్సు సెంటర్లు తిరిగారు. నాలుగైదు సెంటర్లలో అడగ్గా ఒకదానిలో దొరికింది. సాయంత్రం విమల ఇంటికెళ్లి... ఫారం నింపివ్వమని బతిమాలారు.

ఆమె మొహం చిట్లించింది. "ఇది నింపడం చాలా కష్టం. వందరూపాయలైతది" అంది నిర్మొహమాటంగా. మర్నాడు వందరూపాయలు రెండు అపిల్‌పళ్లలో పెట్టి సమర్పించుకున్నారు. ఫారమంతా నింపిందావిడ. ఆ తర్వాత "దీనిమీద మీరంతా సంతకాలు చెయ్యాలె. అటెమ్మ ప్రాజెక్టాఫీసర్ సంతకం తీసుకోవాలె. అప్పుడు వాటిని మున్సిపల్ కమీష్నర్‌కు చూపించాలె" గుక్కతిప్పుకోకుండా చాంతాడంత చెప్పింది. చివరికి "అన్నట్టూ అవన్నీ రెండు లాంగ్‌బుక్కుల్లో రాయాలి. లాంగ్‌బుక్కులు వెంటనే కొనెయ్యండి" ముక్తాయింపు యిచ్చింది.

ఇద్దరూ రిజిష్టర్లు కొన్నారు. మరో వంద విమల మేడంకిచ్చి రాయించు కున్నారు. దానికో వారం రోజులైంది. మరో వారం తిరిగి సభ్యుల సంతకాలు తీసుకున్నారు. వెళ్ళి విమల మేడంకు చూపించారు.

"అబ్బో మీ పట్టుదల బాగానే ఉంది" ప్రశంసల జల్లు కురిపించింది. "ఇప్పుడు మీ పదిమంది గ్రూపు ఫోటో దిగాలి. అట్లే పది మంది విడివిడిగా పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు దిగాలి. అవన్నీ రిజిష్టర్ల అతికించి వాటిమీద ప్రాజెక్టాఫీసర్ సంతకాలు తీసుకోవాలి..." తదుపరి కార్యక్రమం చెప్పింది.

ఇల్లిల్లూ తిరిగి ఫోటోల కార్యక్రమం పూర్తి చేసేందుకు ఇద్దరికీ మరో వారం రోజులైంది. గుర్తింపు కార్డుల జిరాక్సు కాపీలు గూడా సేకరించారు. మూడ్రోజులు వరుసగా మున్సిపలాఫీసుకు తిరిగి, ప్రాజెక్టాఫీసర్ సంతకాలు తీసుకున్నారు.

విమల మేడం వాళ్ళిద్దర్నీ కూచోబెట్టుకుని అంది "ఇప్పుడు మీ పదిమంది సభ్యురాళ్ళు తలా వందరూపాయలివ్వాలి. ఆ వెయ్యి రూపాయల్తో ఇద్దరు లీడర్ల పేరా బ్యాంకులో జాయింట్ ఖాతా తెరవాలి. గ్రూపు పేరుతో రబ్బరుస్టాంపులు చేయించాలి. ప్రతినెలా తలా యాభై రూపాయలు పొదుపు డబ్బు వసూలు చేసి, నెలకో ఐదొందలు బ్యాంకు ఖాతాలో వెయ్యాలి" ఒపిగ్గా చెప్పింది.

సభ్యులనుండి తలో వందరూపాయలు వసూలు చేసేసరికి, తల ప్రాణం తోకకొచ్చింది ఆ ఇద్దరికీ. విమల మేడంను సంప్రదించి బ్యాంకులో కొత్త ఖాతా ఫారం

సంపాదించేందుకో వారమైంది. ఆ ఫారాన్ని బ్యాంకువాళ్ళే సరిగా నింపుతారట. అందుకే బ్యాంకు క్లార్కును బతిమాలి, ఫారం నింపించుకున్నారు. నింపిన ఫారమ్మీద సంతకాలు చేశారు.

ఆ ఫారమ్మీద మున్సిపల్ కమీష్నర్ సంతకం చేసింతర్వాత, బ్యాంకులో కొత్త ఖాతా తెరుస్తారు.

అందుకే అంత పొద్దున్నే వచ్చి, మున్సిపల్ ఆఫీస్‌కెళ్ళాలని గుర్తుచేసింది సరళ.

+

గతాన్ని నెమరేసుకుంటూ గంగమ్మ కొన్ని కాలనీలు తిరిగేసరికి టైం తొమ్మిది కావస్తోంది. డ్వాక్రా గ్రూపు పనులవల్ల ఈ మధ్య ప్రశాంతినగర్ కాలనీలో తిరగడం ఆమెకు కుదరలేదు.

గబగబా ముందుకెళ్ళి ఓ ఇంటిముందాగి "ఆకుకూరలమ్మా!" అని కేకేసింది.

ఇంటావిడ బయటికొచ్చి చేతులు తిప్పుతూ "అయ్య ఛస్తే అమావాస్య ఆగదన్నట్టు, నువు రాకపోతే మాకు ఆకుకూరలే దొరకవనుకున్నావా గంగమ్మా? అప్పుడే ఇంకొకామె వచ్చి ఇచ్చిపోయింది" అంటూ చేతులు ఆపి మూతులు తిప్పింది.

మరో రెండిళ్ళలోనూ అలాంటి జవాబే!

'ఈ గ్రూపు ఏందో, దీని లోన్ల సంగతేమోగాని... మంచి గిరాకులు పోతున్నై' అనుకుంటూ, వేరే కాలనీల్లో తిరిగి ఇంటికొచ్చింది గంగమ్మ. నీరసం ఆవహించింది. సరళ ఇంటికెళ్ళి "పద... మున్సిపల్ ఆఫీసుకు పోదం" అంది.

కుట్టుమిషన్ మీదున్న సరళ భారంగా లేస్తూ "గా గంగెద్దులోళ్ల బట్టలింకా కుట్టేదుందక్కా!" అని ఒళ్ళు విరుచుకుంది.

"ఇయ్యాల్ల మున్సిపల్ కమీష్నర్ సంతకమైపోతే, రేపు బాంకుల ఖాతా తియ్యొచ్చు. మన గ్రూపు రిజిష్టరైపోతాది. కొద్దిరోజులల్ల లోను మంజూరైతది" తియ్యని మాటలు చెప్పిన గంగమ్మ, అలసట బయట పడకుండా జాగ్రత్తపడింది.

ఏమీ తినకుండా బయల్దేరారిద్దరూ. కమీష్నర్ గదిదాకా వెళ్ళారు.

"హమ్మయ్య! కమీష్నరు సారున్నారు" సరళవైపు కనుబొమలెగరేసింది గంగమ్మ.

"నిజమేనక్కా!" సరళ కళ్ళు ఆశాజ్యోతులైనాయి.

గేటువద్ద శాంతమ్మ ఉంది.

అవసరమైనప్పుడు అందరిముందూ తల వంచాలిగదా. అటెండర్ శాంతమ్మ గదవబట్టి బతిమాలారు. మూలవిరాట్టుముందుకెళ్ళేందుకు పూజారి వరం దొరికింది.

కమీష్నర్‌కు ఇద్దరూ చెరో నమస్కారం అర్పించుకున్నారు. నవ్వు అతికించుకుని, బ్యాంకు ఫారం ఆయన చేతికిచ్చారు.

ఆయన ఇద్దర్నీ వింతగా చూసి, ఫారమంతా చదివేశాడు.

"సారీ అమ్మా!" కాళ్ళూపడమాపేసి ముందుకు వంగాడు ఆయన. "అసెంబ్లీ ఎన్నికలొస్తున్నాయి గదా! నిన్ననే ఎన్నికల తేదీ ప్రకటించారు, వెంటనే ఎలక్షన్ కోడ్ అమల్లోకొచ్చింది. కొత్త గ్రూపులిప్పుడు చెయ్యరాదు. దీనిమీద సంతకం... ఎలక్షన్లు అయిపోయింతర్వాతనే!" అంటూ ఫారం వాపసిచ్చి కుర్చీ వెనక్కు ఒరిగాడు.

కాలినడకన తిరుమల కొండెక్కుతూ, కాలు జారి లోయలో పడ్డట్టనిపించింది ఇద్దరికీ.

"మీ సంతకం కోసం మూణ్రోజుల నుండి తిరుగుతున్నం సార్!" బతిమాలింది సరళ. గంగమ్మ దీనంగా చూసింది..

"కావచ్చు. నేను లీవులున్న. ఈ రోజే జాయినయిన. నేనేమీ చెయ్యలేను" అసహనంగా సెల్‌ఫోనందుకున్నాడు.

ఇద్దరి వీపులమీద పిడిగుద్దులు పడ్డట్లైంది.

"ఇన్ని రోజులు మా పనులు ఇడిచిపెట్టి, మీ ఆఫీసు చుట్టూ తిరిగినం సార్! కష్టంజేస్కుని బతికెటోళ్ళం. ఏది చెయ్యమంటే అది గంగెద్దోలె తలూపుకుంట చేసినం. ఇప్పుడిట్లంటే ఎట్ల సారూ?" గంగమ్మ గొంతులో అసహనం.

కమీష్నర్ కోపం నషాళానికంటింది. "గె...ట్టా...ట్!" ఆయన అరుపుతో ఆ ఆఫీసు దద్దరిల్లింది!

*(విపుల, సెప్టెంబర్ - 2011)*